సాక్షి నిజామాబాద్

ఆదివారం । 16 । జూన్ । 2024



నాణ్యమైన భోజనం పెట్టాలి

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని డీఈవో దుర్గాప్రసాద్ సూచించారు.

- 9లో ▸



తండ్రి యాదిలో..

నిజామాబాద్‌కు చెందిన మంచాల జ్ఞానేందర్ తన తండ్రి పేరిట ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
36.5 /25.9

వాతావరణం

ఉదయం ఎండగా ఉంటుంది. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతం అవుతుంది. చలిగాలులు వీస్తాయి. అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

బ్యాంకు లింకేజీ రుణ పంపిణీలో జిల్లాకు అవార్డు



డొంకేశ్వర్(ఆర్మూర్) : లక్ష్యానికి మించి బ్యాంకు లింకేజీ రుణాలు అందజేసినందుకు జిల్లాకు రాష్ట్ర స్థాయి అవార్డు దక్కింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా డీఆర్‌డీవో సాయాగౌడ్ అవార్డును అందుకున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 15,590 మహిళా సంఘాలకు రూ.1,065 కోట్ల (103.18శాతం) బ్యాంకు లింకేజీ రుణాలను అందజేశారు. జిల్లాలో లక్ష్యానికి మించి రూ.65.29కోట్ల రుణాలు అందజేసిన డిచ్‌పల్లి మండల సమాఖ్యాకు కూడా అవార్డు దక్కింది. హైదరాబాద్‌కు వెళ్లిన వారిలో డీఆర్‌డీవోతో పాటు ఏపీడీ రవీందర్, బ్యాంకు లింకేజీ విభాగం డీపీఎం నీలిమా ఉన్నారు.

తెయూ ఇన్‌చార్జి వీసీగా సందీప్‌కుమార్ కొనసాగింపు



తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ సందీప్‌కుమార్ సుల్తానియాను కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని యూనివర్సిటీలకు 2021 మే 21 అప్పటి ప్రభుత్వం రెగ్యులర్ వీసీలను నియమించింది. 2024 మే 21 తో వారి పదవీ కాలం ముగిసింది. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉండటం, కొత్త వీసీల నియామక ప్రక్రియ ఇంకా పూర్తి కాకపోవడంతో ప్రభుత్వం 10 యూనివర్సిటీలకు సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్లను జూన్ 15వరకు ఇన్‌చార్జి వీసీలుగా నియమించింది. ఎన్నికల కోడ్ ముగిసినా శాశ్వత వీసీల నియామక ప్రక్రియ పూర్తి కాకపోవడంతో ఇన్‌చార్జీ వీసీల పదవీ కాలాన్ని తదుపరి ఉత్తర్వులు జారీ చేసేవరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



కామారెడ్డి క్రైం: నూతన చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీ నర్సయ్య సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నూతన నేర చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏఎస్పీ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 జూలై నుంచి అమలులోకి రానున్న నూతన భారతీయ చట్టాలపై ఉమ్మడి జిల్లాలోని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లు, పోలీస్ అధికారులకు న్యాయ సలహాలు అందించారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినయం–2023, ఐపీసీ, సీఆర్పీసీ, ఐఈఏ(ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్)లో కీలక మార్పులు చేశారన్నారు. ఇకపై ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్‌కు కల్పించే అధిక ప్రాముఖ్యత తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ పీపీలు బోసారపు రాజేశ్‌గౌడ్, అశోక్ శివరాం, నంద రమేశ్, నిమ్మ దామోదర్ రెడ్డి, రాజేశ్వరి, సత్యనారాయణ, శేషు, డీఎస్పీలు నాగేశ్వరరావు, మాధనలాల్, సీఐలు ఎస్సైలు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి బస్టాండ్ వద్ద షాపింగ్ కాంప్లెక్స్



డిచ్‌పల్లి : డిచ్‌పల్లి ఆర్టీసీ బస్టాండ్ వద్ద షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడుతున్నట్లు నిజామాబాద్ రీజనల్ మేనేజర్ జానీరెడ్డి తెలిపారు. డిచ్‌పల్లి బస్టాండ్‌ను శనివారం సాయంత్రం ఆయన సందర్శించి, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ఇప్పటికే 8 దుకాణాల టెండర్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. కంట్రోలర్ చందర్‌నాయక్ ఉన్నారు.



సాగులో వైవిధ్యం!

- ప్రకృతి వ్యవసాయం చేస్తున్న చిన్నికృష్ణుడు
- సేంద్రియ పద్ధతిలో వరి సాగు
- 120 రకాల విత్తనాలను పరిచయం చేసిన ఘనత

సండే స్పెషల్



డొంకేశ్వర్(ఆర్మూర్) : సాగులో వైవిధ్యం ప్రదర్శిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు చింతలూరు గ్రామానికి చెందిన చిన్నికృష్ణుడు. సేంద్రియ విధానంలో సాగు చేస్తూ పంటలు పండిస్తున్నాడు. జక్రాన్‌పల్లి మండలం చింతలూరుకు చెందిన చిన్నికృష్ణుడికి (నాగుల చిన్న గంగారాం) మొత్తం పన్నెండున్నర ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆయన చదివింది ఆరో తరగతి.. ప్రకృతి వ్యవసాయం చేస్తూ తన వ్యవసాయ క్షేత్రాన్ని వైవిధ్య సాగుకు అడ్డాగా మార్చుకున్నాడు. శాస్త్రవేత్తలే ఆశ్చర్యపోయేల సేంద్రియ పద్ధతిలో వివిధ రకాల వరిని పండిస్తున్నారు. ఏకంగా విత్తన బ్యాంకునే ఏర్పాటు చేసి 120 రకాల విత్తనాలను పరిచయం చేసి ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. సాగుతీరు ఆయనకు ఎన్నో దేశ, విదేశ అవార్డులను తెచ్చిపెట్టింది. చాలా సదస్సులకు ఆహ్వానాలు అందుకుని తాను చేస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని అందరికీ పరిచయం చేస్తున్నాడు. ప్రస్తుతం చింతలూరులో 30 గుంటలు, నిజామాబాద్ రూరల్ మండలం గూపన్‌పల్లిలో 30 గుంటల భూమిలో సేంద్రియ విధానంలో వరిని సాగు చేస్తున్నాడు. ఈ విధానంలో సాగు చేసిన పంటలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని చిన్నికృష్ణుడు తెలిపారు. ప్రయోగాత్మకంగా 2007లో సేంద్రియ సాగును ప్రారంభించినట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయాన్ని ఇతర రైతులు కూడా అలవర్చుకొవడానికి తాను చేసిన వంగడాలను విక్రయిస్తున్నట్లు ఆయన చెబుతున్నాడు.



చిన్ని కృష్ణుడు పండించిన వివిధ రకాల విత్తనాలు



అవార్డును అందుకుంటున్న చిన్ని కృష్ణుడు (ఫైల్)

దేశీ, విదేశీ విత్తనాలు

వరిసాగులో రారాజుగా పేరొందిన చిన్నికృష్ణుడు చాలా రకాల విత్తనాలను పరిచయం చేశారు. ఇందులో 37 రకాల దేశీ, 11 రకాల విదేశీ విత్తనాలున్నాయి. 2017లో అమెరికా నుంచి కాలిఫోర్నియా, ఇటలీ విత్తనాలను తెప్పించారు. బియ్యం నుంచి విత్తనాలు తీసిన ఘనత చిన్ని కృష్ణుడిదేనని చెప్పవచ్చు. ఈయన వద్ద ప్రత్యేక రకాలైన కృష్ణవీహి, రామ్‌లక్ష్మణ్, కాలజీర, చిన్నపొన్ను, గంగాగోల్డెన్ బ్రౌన్‌రైస్, గంగాస్వీట్ బ్రౌన్‌రైస్, మెడిసినల్ రెడ్‌రైస్, కుంకుమ బంతులు, గంగాగ్రీన్ బ్లాక్ రైస్, రిసోట రైస్, రత్నచోళి, మాపిలై సాంబ, గంగా జపనీ గ్రీన్ బ్లాక్ రైస్, కర్పూకౌని, ఫర్‌బిడెన్ రైస్ బియ్యం ఉన్నాయి. అదే విధంగా వరిసాగులో వివిధ సందేశాత్మక చిత్రాలు వచ్చేలా శ్రమించాడు. సోమసూత్ర ప్రదక్షిణ, చిన్నికృష్ణుడి తల్లిదండ్రుల చిత్రాలు సైతం పొలంలో వరితో ప్రదర్శించాడు.

ఎన్నో అవార్డులు

సాగులో ఆదర్శంగా నిలుస్తున్న చిన్ని కృష్ణుడికి ఇరవై ఏళ్లలో ఎన్నో అవార్డు వచ్చాయి. ఉపరాష్ట్రపతి అవార్డుతో డాక్టరేట్‌ను సైతం సొంతం చేసుకున్నాడు. దీంతో పాటు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, భారత్ వరల్డ్ రికార్డ్స్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్, కోహినూర్ వరల్డ్ రికార్డ్స్, జై ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ట్రెజర్ వరల్డ్ రికార్డ్స్, ఫోకస్ వరల్డ్ రికార్డ్స్, గ్రాండ్ వరల్డ్ రికార్డ్స్, ఫ్రీడమ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, గ్లోరీ వరల్డ్ రికార్డ్స్, విశ్వం వరల్డ్ రికార్డ్స్, స్టేట్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇండియా, డైమండ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, గతేడాది అబ్దుల్ కలాం వార్డు, ఇలాంటి వంద వరకు అవార్డులు పొందారు.

అధికారులపై దాడులు హేయం

ఫారెస్ట్ సిబ్బందికి ఆయుధాలు ఇవ్వాలి

నిజామాబాద్ అర్బన్ : విధుల్లో ఉన్న అటవీ శాఖ సిబ్బందిపై దాడి చేయడం హేయమైన చర్య అని, దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అటవీ శాఖ అధికారులు అన్నారు. మోపాల్ మండలం కాల్పోల్‌లో జరిగిన ఘటనను నిరసిస్తూ శనివారం నగరంలోని డీఎఫ్‌వో కార్యాలయంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై ప్రెస్‌మీట్ పెట్టారు. పర్యావరణ పరిరక్షణ కోసం అటవీ సిబ్బంది కృషి చేస్తున్నారని, అడవుల్లో చెట్లు నరికి భూములను ఆక్రమించడంతో పర్యావరణం దెబ్బతింటుందని తెలిపారు. అయితే అడవుల పరిరక్షణ కోసం వెళ్లిన సమయంలో తమపై కొందరు దాడులకు దిగుతున్నారని ఇలాంటి సమయంలో ప్రతిఘటించడానికి సరైన ఆయుధాలు లేకపోవడంతో ప్రాణాపాయం ఏర్పడుతుందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం ఆలోచించి అటవీ ఉద్యోగులకు ఆయుధాలను ఇవ్వాలని, పోలీసు రక్షణ కల్పించాలని కోరారు. కొందరు రాజకీయ నాయకుల స్వార్థపూరిత చర్యలతో అమాయక ప్రజలు అటవీ అధికారులపై దాడులకు పాల్పడుతున్నారని, దీనిని గమనించాలన్నారు.



అటవీ శాఖ కార్యాలయంలో మాట్లాడుతున్న నిజామాబాద్ ఎఫ్‌డీవో సుధాకర్‌రావు

అటవీ భూములను ఆక్రమించడం చట్ట విరుద్ధమని తెలుసుకోవాలని కోరారు.

అనంతరం కలెక్టరేట్‌కు వెళ్లి అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌కు, సీపీ కార్యాలయంలో నిజామాబాద్ డీసీపీ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. కాల్పోల్‌లో దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. నిజామాబాద్ ఎఫ్‌డీవో సుధాకర్ రావు, ఎఫ్ఆర్వోలు రవి మోహన్ భట్, పద్మారావు, వినయ్‌నాయక్, రవీందర్, రాధిక, జూనియర్ అటవీ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు సుధాకర్ తదితరులున్నారు.



డీసీపీ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఫారెస్ట్ రేంజ్ అధికారులు

పోలీసుల అదుపులో ఏడుగురు!

- ఫారెస్ట్ అధికారులపై దాడి కేసులో..
- మిగతా వారి కోసం అన్వేషిస్తున్న పోలీసులు

మోపాల్ : మండలంలోని కాల్పోల్ గ్రామపరిధిలో శుక్రవారం అటవీశాఖ అధికారులపై దాడికి పాల్పడిన కేసులో పోలీసులు ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఉదయం నుంచి రాత్రి వరకూ అక్కడే మకాం వేసి దాడిలో హస్తమున్న వారిని పట్టుకున్నట్లు సమాచారం. కాల్పోల్‌లో అటవీ భూమి చదును, దున్నడాన్ని అడ్డుకున్నందుకు సౌత్ ఎఫ్ఆర్‌వో రాధిక, సెక్షన్ ఆఫీసర్ సాయికృష్ణ, బీట్ ఆఫీసర్ ప్రగత్‌కుమార్‌పై దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ కేసులో సుమారు 30 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

పరారైన వారి కోసం గాలింపు

దాడికి పాల్పడిన ఏడుగురిని అదుపులోకి తీసుకోగా, మిగతా వారి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వారిని పట్టుకునేందుకు యత్నిస్తున్నారు. అటవీశాఖ, పోలీస్ ఉన్నతాధికారులు ఈ దాడిని తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఈ క్రమంలో స్థానిక పోలీసులకు కేసు సవాల్‌గా మారింది. దీంతో దాడికి పాల్పడిన వారిని, అందులో హస్తమున్న వారందరినీ గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ కేసును నీరుగార్చకుండా, రాజకీయ జోక్యం లేకుండా పోలీసులు చాకచక్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది.

ఈ-పాస్ ద్వారానే ఎరువులు అమ్మాలి



మాట్లాడుతున్న డీఏవో వాజిద్ హుస్సేన్

డొంకేశ్వర్(ఆర్మూర్) : వ్యవసాయ సహకార సొసైటీలు, వ్యాపారులు ఈ–పాస్ మిషన్ ద్వారానే రైతులకు ఎరువులను విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ స్పష్టం చేశారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీలర్లు, సొసైటీ కార్యదర్శులు, వ్యవసాయాధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ... ఎరువుల అమ్మకాలు సరైన పద్ధతిలో జరగాలని, వాటిని పక్కదారి పట్టిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువులు, విత్తనాలు అమ్మే సమయంలో తప్పనిసరిగా రైతుల వివరాలను నమోదు చేసుకోవాలని, కొనుగోలు చేసిన వారికి రసీదు ఇవ్వాలన్నారు. సాంకేతిక సమస్యలుంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. అవసరమైన ఎరువులను జిల్లాకు తెప్పిస్తున్నామని, కొరత ఏ మాత్రం లేదని తెలిపారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే డీలర్‌షిప్ రద్దు చేస్తామన్నారు. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో సొసైటీలు, డీలర్ షాపులను తనిఖీలు చేయాలన్నారు. సమావేశంలో డీసీవో శ్రీనివాస రావు, సీడ్స్ కార్పొరేషన్ ఆర్ఎం విష్ణువర్ధన్, డీసీఎంఎస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- ఉమ్మడి జిల్లా సహకార బ్యాంకు జనరల్ మేనేజర్ సూర్యప్రకాశ్

లింగంపేట(ఎల్లారెడ్డి): ఉమ్మడి జిల్లాలోని సహకార బ్యాంకుల్లో దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న రైతులు, వినియోగదారులు ఓటీఎస్(వన్‌టైం సెటిల్‌మెంట్) విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా సహకార బ్యాంకు జనరల్ మేనేజర్ సూర్యప్రకాశ్ సూచించారు. శనివారం లింగంపేటలోని సహకార బ్యాంకులో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఓటీఎస్ విధానాన్ని రెండేళ్లుగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఓటీఎస్ విధానం ఈ నెల 30వ తేదీ వరకు ముగుస్తుందన్నారు. ఓటీఎస్ విధానం వల్ల జిల్లా సహకార బ్యాంకుకు రూ. 20 కోట్లు నష్టం వచ్చిందన్నారు. జిల్లాలో రూ. 230 కోట్ల బకాయిలుండగా రూ. 100 కోట్లు వసూలు చేసినట్లు తెలిపారు. మరో రూ. 130 కోట్లు బకాయి ఉన్నట్లు పేర్కొన్నారు. లింగంపేట మండలంలో రూ. 14కోట్లు బకాయిలు ఉన్నట్లు వివరించారు. జిల్లాలో ఇదే అత్యధికమన్నారు. పాత బకాయిలు వసూలు కాకపోవడంతో కొత్తవారికి రుణాలు ఇవ్వలేకపోతున్నామన్నారు. అలాగే బ్యాంకులో డిపాజిట్ దారులకు డబ్బులు ఇవ్వలేకపోతున్నామన్నారు. బకాయిలు పేరుకుపోవడంతో రైతులను ఒత్తిడి చేయాల్సి వస్తుందన్నారు. రుణాలు తీసుకున్న వారి నుంచి నిబంధనల ప్రకారం వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పొల్కంపేట రైతు రాజశేఖర్‌రెడ్డి 2010లో రుణం తీసుకొని ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో చెల్లించలేదన్నారు. సహకార సంఘం చట్టం ప్రకారం సదరు రైతు వ్యవసాయ భూమిలో ఫ్లెక్సీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతుకు ఓటీఎస్ పద్ధతిలో రూ. 1.70 లక్షలు మాఫీ వర్తిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా వ్యవసాయ పంట రుణాలు మాత్రమే మాఫీ అవుతాయన్నారు. దీర్ఘకాలిక రుణాలుకు మాఫీ వర్తించదని స్పష్టం చేశారు. రైతులు ఈ నెల 30వ తేదీలోపు రుణాలు చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో డీజీఎం శ్రీనివాస్, ఏజీఎం యాదగిరి, నాగరాజు, రికవరీ ఏజీఎం భూపాల్‌రెడ్డి, బ్యాంకు మేనేజర్ కుమారస్వామి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా సహకార బ్యాంకు జనరల్ మేనేజర్ సూర్యప్రకాశ్

కామారెడ్డి కలెక్టర్‌గా ఆశిష్ సాంగ్వాన్!

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీ అయిన జితేష్ వి పాటిల్

సాక్షి, కామారెడ్డి : జిల్లా కొత్త బాస్‌గా నిర్మల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న యువ ఐఏఎస్ అధికారి ఆశిష్ సాంగ్వాన్ రానున్నారు. ఇక్కడ పనిచేసిన కలెక్టర్ జితేష్ వి పాటిల్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీ అయ్యారు. ఆశిష్ సాంగ్వాన్ 2016 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. హర్యానా రాష్ట్రంలోని భివానీకి చెందిన ఆయన ఢిల్లీ ఐఐటీలో కంప్యూటర్ సైన్స్‌లో ఇంజినీరింగ్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. తర్వాత అమెరికాలోని జార్జియా టెక్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ చేసిన అనంతరం సివిల్ సర్వీసెస్‌కు ప్రిపేర్ అయి 2013లో తొలిసారి 607 ర్యాంకుతో రైల్వేస్‌లో ఉద్యోగం సాధించారు. తర్వాత 2014లో రెండోసారి మెరుగైన ర్యాంకు రాకపోవడంతో మళ్లీ ప్రిపేర్ అయి, 2015లో జరిగిన సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో 12వ ర్యాంకు సాధించి ఐఏఎస్ అధికారిగా ఎంపికయ్యారు. ఆయన భార్య వల్లూరు క్రాంతి కూడా 2016 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. ఆమె ప్రస్తుతం సంగారెడ్డి కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మధ్యప్రదేశ్ క్యాడర్‌కు చెందిన సాంగ్వాన్ వల్లూరి క్రాంతిని వివాహం చేసుకున్న నేపథ్యంలో తెలంగాణ క్యాడర్‌కు వచ్చారు. నిర్మల్ కలెక్టర్‌గా సాంగ్వాన్ నిక్కచ్చిగా వ్యవహరించారన్న పేరుంది. అధికారులు, ఉద్యోగులు డ్యూటీ విషయంలో నిర్లక్ష్యం చేస్తే కొంత కఠినంగానే ఉంటారని చెబుతున్నారు.



ఆశిష్ సాంగ్వాన్, ఐఏఎస్

ఉద్యోగులతో ఫ్రెండ్లీగా పాటిల్..

కామారెడ్డి కలెక్టర్‌గా పనిచేస్తున్న జితేష్ వి పాటిల్ ఇక్కడ రెండేళ్ల తొమ్మిది నెలల పాటు పనిచేశారు. ముంబయి ఐఐటీ నుంచి ఇంజినీరింగ్ పూర్తి చేసిన పాటిల్ ఐఏఎస్‌కు సెలెక్ట్ అయ్యాక నిజామాబాద్ నగరపాలక సంస్థ కమిషనర్‌గా పనిచేశారు. అక్కడి నుంచి కామారెడ్డి కలెక్టర్‌గా 2021 సెప్టెంబర్ 3న వచ్చారు. ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెంకు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. పాటిల్ జిల్లాలో పనిచేసిన సమయంలో ఎవరినీ నొప్పించకుండా ఉద్యోగులతో ఫ్రెండ్లీగా ఉంటూ వచ్చారు. తన పని తాను చేసుకుంటూ వెళ్లారు.

విద్యార్థులను బడిలో చేర్పించండి

మోర్తాడ్: పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ)ల స్థానంలో నియమించిన అమ్మ ఆదర్శ కమిటీలకు కీలక బాధ్యతలను విద్యాశాఖ అప్పగించింది. బడిబాట కార్యక్రమంలో అమ్మ కమిటీలు కీలకంగా వ్యవహరించడంతో పాటు విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ఈ కమిటీలే ప్రధాన పాత్ర పోషించాలని నిర్దేశించారు. జిల్లాలో ఉన్న అన్ని పాఠశాలల్లో బడిబాట కార్యక్రమం ఆరంభమైంది. బడిబాటలో ఉపాధ్యాయులకు అమ్మ కమిటీలు బాసటగా నిలుస్తున్నాయి. అలాగే బడి బయటి పిల్లలను బడిలో చేర్పించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను గతంలో కంటే పెంచడానికి అమ్మ కమిటీలు నిరంతరం కృషి చేయాల్సి ఉంది. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరిగే అభివృద్ధి పనులకు అమ్మ కమిటీల అజమాయిషీ ఎంతో ఉంది. బడిలో విద్యార్థులను చేర్పించే బాధ్యత కూడా ఈ కమిటీలకే అప్పగించారు. ఈ కమిటీ సభ్యులు బడిబాటలో పాల్గొని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ప్రైవేటు స్కూల్స్ నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోకి విద్యార్థులను మార్పించాల్సి ఉంది. ప్రభుత్వ పాఠశాలల మనుగడ కోసం విద్యార్థుల సంఖ్యను పెంచుకోవడం ప్రభుత్వ ఉద్దేశంగా ఉంది. ఇందుకోసం అమ్మ కమిటీలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాల్సి ఉంది.



తిమ్మాపూర్‌లో విద్యార్థులను బడిలో చేర్పిస్తున్న అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు

క్లుప్తంగా

టీ హబ్, సఖీ సెంటర్ల తనిఖీ



నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని తెలంగాణ డయాగ్నొస్టిక్ హబ్, పాలియేటివ్ కేర్, సఖీ సెంటర్లతోపాటు అనాథ ఆశ్రమాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ తుకారామ్ రాథోడ్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ అందుతున్న సేవలను పర్యవేక్షించారు. తెలంగాణ డయాగ్నొస్టిక్ హబ్‌లో డెంగీ పరీక్ష ఎన్‌ఎస్ 1 స్ట్రిప్స్ 223 అందుబాటులో ఉన్నాయన్నారు. మిగతా పరీక్షలకు సంబంధించి ఎన్ని కెమికల్స్ స్టాక్ ఉన్నాయని తెలుసుకున్న ఆయన.. రానున్న కాలానికి సీజనల్ వ్యాధుల ప్రబలే అవకాశం ఉన్నందున సరిపడా లాజిస్టిక్స్ కోసం ఇండెంట్ పెట్టి తెప్పించుకోవాలని సిబ్బందికి సూచించారు. రికార్డులు, రిపోర్టులను పరిశీలించారు. 24 గంటల్లోగా రిపోర్టులు పేషెంట్‌కు చేరేలాగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమయపాలన పాటించాలని ఆయా సెంటర్లలో సిబ్బందికి సూచించారు. అనాథ ఆశ్రమంలో ఉన్న ఏడుగురితో మాట్లాడి వారికి అందుతున్న సేవలను తెలుసుకున్నారు.

ఎస్సారెస్పీలోకి స్వల్పంగా వరద

బాల్కొండ: ఎగువప్రాంతాల్లో వర్షాలు కురవడంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి స్వల్పంగా వరద వస్తోంది. 1446 క్యూసెక్కుల వరద వస్తుండడంతో ప్రాజెక్ట్ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రాజెక్ట్ నుంచి సరస్వతి కాలువ ద్వారా 10 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా ఆవిరి రూపంలో 245 క్యూసెక్కులు పోతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 1091 అడుగులు (80 టీఎంసీలు) కాగా, శనివారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1056.80 అడుగుల (7.82 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

వర్షాల కోసం మహిళల బతుకమ్మ ఆట



నిజాంసాగర్(జుక్కల్): వర్షాలు సమృద్ధిగా కురవాలని వేడుకుంటూ మహమ్మద్‌నగర్ మండలం హసన్‌పల్లి చెరువు వద్ద స్థానిక మహిళలు శనివారం బతుకమ్మ ఆడారు. చెరువులో పూడికతీత పనులు చేపట్టిన ఉపాధి హామీ కూలీలు, మహిళలు వర్షాలు కురవాలని బతుకమ్మ ఆడి స్థానికంగా ఉన్న ఆలయంలో పూజలు చేశారు.

అక్కాపూర్‌లో వింత గబ్బిలం



మాచారెడ్డి: మండలంలోని అక్కాపూర్‌లో ఓ వింత గబ్బిలం శనివారం ప్రత్యక్షమైంది. గబ్బిలాలు సాధారణంగా నలుపు రంగులో ఉంటాయి. కానీ అక్కాపూర్‌లో గోధుమ రంగులో ఉన్న వింత గబ్బిలం కనిపించింది. ఈ గబ్బిలాన్ని చూసేందుకు గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

తండ్రి యాదిలో..

- మంచాల శంకరయ్య చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు
- తొమ్మిదేళ్లుగా సామాజిక సేవలో తరిస్తున్న మంచాల జ్ఞానేందర్
- 'తండ్రుల దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనం..



జిల్లా న్యాయమూర్తి సునీత కుంచాలకు భగవద్గీత అందజేస్తున్న జ్ఞానేందర్ (ఫైల్)



ట్రస్ట్ ఆధ్వర్యంలోని స్వర్గయాత్ర రథం



మంచాల జ్ఞానేందర్

సుభాష్‌నగర్: నడక నేర్పడం నుంచి ప్రతి కష్టంలో.. సుఖంలో తానున్నానంటూ వెన్నుతట్టి ప్రోత్సహించడంలో నాన్న స్థానం ప్రత్యేకమైంది. అటువంటి తండ్రిని స్మరించుకుంటూ నిత్యం సామాజిక సేవలో తరలిస్తున్నాడు మంచాల జ్ఞానేందర్. 11 ఏళ్లుగా మంచాల శంకరయ్య చారిటబుల్ ట్రస్ట్ పేరుతో అనేక సేవాకార్యక్రమాలు చేస్తున్నారు. ఏడాదికోసారైనా తండ్రిని గుర్తు చేసుకునే వారు లేని రోజుల్లో.. ఆయన పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేసి నిరంతరాయంగా సామాజిక సేవలు చేస్తూ మంచాల జ్ఞానేందర్ నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. తండ్రుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.. మంచాల శంకరయ్య గుప్త దంపతులకు ఇద్దరు సంతానం. వారిలో మంచాల జ్ఞానేందర్ పెద్దవాడు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న జ్ఞానేందర్ తండ్రి శంకరయ్య గుప్త 1998లో మృతిచెందారు. తండ్రి మృతితో ఎంతో కుమిలిపోయిన ఆయన.. తిరిగి కోలుకోవడానికి చాలా సమయం పట్టింది. అప్పటి నుంచి తనకు జన్మనిచ్చిన తండ్రి పేరుతో ఏదైనా చేయాలని భావించాడు. 2013లో మంచాల శంకరయ్య చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటుచేశారు. శంకరయ్య పేరు చిరస్మరణీయంగా నిలిచేలా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతోపాటు హైదరాబాద్, సికింద్రాబాద్, సిరిసిల్ల ప్రజలకు నిత్యం సేవలందిస్తున్నారు.

ట్రస్ట్ ద్వారా అందిస్తున్న సేవలు

మంచాల శంకరయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సిరిసిల్ల, హైదరాబాద్, కనగర్తి, సికింద్రాబాద్, నిజామాబాద్, బోధన్, బాన్సువాడ, కాశీలో వైకుంఠ రథాలు ఉచితంగా పంపిస్తున్నారు. అంతేగాకుండా పేదల కోరిక మేరకు 50 మందికి భోజనాలు కూడా అందజేస్తున్నారు. మృతదేహాలకు ఫ్రీజర్ బాక్సులు ఉచితంగా అందిస్తున్నారు. వినాయక చవితికి మట్టి వినాయకులు పంపిణీ, ట్రస్ట్ ద్వారా 30వేల మొక్కలు నాటారు. పేద విద్యార్థులకు చదువుకునేందుకు ఆర్థికసాయం, నోట్‌బుక్కుల పంపిణీ, అంతరించిపోతున్న పక్షుల కోసం ఫుడ్, వాటర్ బాక్సులు పంపిణీ చేస్తున్నారు. ప్రతి వేసవిలో వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తుండడంతోపాటు ఇప్పటివరకు 5,600 భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. కరోనా సమయంలో పేదలకు అన్నదానం చేశారు. నిత్యం అనేక దేవాలయాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

క్రైం కార్నర్

బెట్టింగ్‌లకు అలవాటుపడి.. అప్పులు తీర్చేందుకు హత్య

- నమ్మించి గొంతుకోసిన యువకుడు
- నగల కోసం ఘాతుకం
- బాన్సువాడ వృద్ధురాలి హత్య కేసును ఛేదించిన పోలీసులు
- నిందితుడి అరెస్ట్, రిమాండ్



బాన్సువాడ డీఎస్పీ కార్యాలయంలో హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ కృష్ణ

బాన్సువాడ : ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, గేమింగ్‌లకు అలవాటుపడిన యువకుడు చేసిన అప్పులు తీర్చేందుకు వృద్ధురాలి గొంతుకోసి నగలు ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తేల్చారు. బాన్సువాడలోని తాడ్కోల్ శివారులో ఉన్న డబుల్ బెడ్ రూం కాలనీలో ఈనెల 12వ తేదీన ఉప్పరి సాయవ్వ(70) అనే వృద్ధురాలు హత్యకు గురికాగా, కేసును ఛేదించిన పోలీసులు.. 23 ఏళ్ల యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో కేసుకు సంబంధించిన వివరాలను సీఐ కృష్ణ శనివారం వెల్లడించారు.

డబుల్ బెడ్‌రూం కాలనీలోని తన చిన్నకుమారుడి ఇంట్లో ఉప్పరి సాయవ్వ(70), అదే భవనం పైఅంతస్తులో తొడిమెల సాయిబాబా(23) కుటుంబ సభ్యులతో కలిసి ఉండేవారు. స్థానికంగా ఓ కిరాణాదుకాణంలో పని చేసే సాయిబాబా ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, గేమింగ్‌లకు అలవాటుపడి సుమారు రూ.16లక్షల వరకు అప్పు చేశాడు. సాయవ్వ వద్ద సైం రూ.20వేలు అప్పు తీసుకున్నాడు. అప్పు ఇచ్చిన వాళ్లు డబ్బులు అడుగుతుండడంతో సాయిబాబా కన్ను సాయవ్వ ఒంటిపై ఉన్న నగలపై పడింది. ఆమెను హతమారిస్తే నగలు అమ్ముకోవచ్చని, ఆమెకు ఇవ్వాల్సిన రూ.20వేలు ఇచ్చేది ఉండదని భావించాడు.

దీంతో ఆమె హత్యకు కుట్రపన్నాడు. సాయిబాబా ఈ నెల 11న అర్ధరాత్రి సాయవ్వకు ఫోన్ చేసి తన ఇంట్లో వాళ్లు గడియ పెట్టి పడుకున్నారని, ఫోన్ చేస్తే తీయడం లేదని, ఈ రాత్రికి మీ ఇంట్లో పడుకుంటానని అనడంతో ఆమె నమ్మింది. ఇంట్లో నిద్రించిన సాయిబాబా తెల్లవారు జామున నాలుగు గంటలకు తన వెంట తెచ్చుకున్న కత్తితో సాయవ్వ గొంతుకోసి, పొట్టలో పొడిచి హత్య చేశాడు. వృద్ధురాలి చెవులకు ఉన్న కమ్మలు(నాగులు), చేయికున్న వెండి కడియాలు, మెడలో ఉన్న బంగారు గుండ్లను తీసుకుని బయటకు వచ్చాడు. కత్తిని పక్కనే ఉన్న మురుగు కాలువలో పారేసి తన ఇంట్లోకి వెళ్లి ఏమీ తెలియనట్లు పడుకున్నాడు. 12వ తేదీన ఉదయం ఓ స్మార్ట్ ఫైనాన్స్‌లో చెవికమ్మలు తాకట్టు పెట్టి రూ.45,300 తీసుకుని కొంత మొత్తాన్ని తన ఖాతాలో వేసుకుని, మిగతా డబ్బులను అప్పు ఇచ్చిన వారికి ఇచ్చిన తరువాత తన అక్క వాళ్ల ఇంటికి వెళ్లి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. హత్య కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాయవ్వ నంబర్‌కు చివరగా సాయిబాబా ఫోన్ చేసినట్లు నిర్ధారించుకున్నారు. తాడ్కోల్ చౌరస్తా వద్ద అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా తానే సాయవ్వను హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. వృద్ధురాలి హత్య కేసును ఛేదించిన తనతోపాటు హెడ్ కానిస్టేబుల్ అశోక్, మోతీలాల్, హోంగార్డులు సయ్యద్ మూస, హేమాద్రిని డీఎస్పీ అభినందించినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం



ఘటనాస్థలంలో ప్రమాదానికి గురైన వాహనాలు



యాదుల్ (ఫైల్)



శివరాం (ఫైల్)

పెద్దకొడప్‌గల్(జుక్కల్): అతివేగంగా దూసుకొచ్చిన ఫార్చునర్ కారు టీవీఎస్ ఎక్సెల్‌ను ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటన మండలంలోని బేగంపూర్ చౌరస్తా 161 జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. బిచ్కుంద మండల కేంద్రానికి చెందిన ఎస్‌కే మహ్మద్ యాదుల్ (56) శాంతాపూర్‌కు చెందిన మేస్త్రి ఏర్కొండి శివరాం(55)తో కలిసి ద్విచక్రవాహనంపై పిట్లంకు వెళ్లాడు. యాదుల్ పిట్లంలో ఉంటున్న తన కొడుకు ఇంటి పైకప్పుకు మరమ్మతులు చేయించేందుకు శివరాంను తీసుకెళ్లాడు. అక్కడ పని పూర్తయిన తరువాత ఇద్దరు కలిసి తిరిగి వస్తుండగా.. వెనుక నుంచి అతివేగంగా దూసుకొచ్చిన ఫార్చునర్ కారు బేగంపూర్ చౌరస్తాలో ఢీకొట్టింది. ఘటనాస్థలంలోనే యాదుల్, శివరాం మృతి చెందగా, కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. ద్విచక్రవాహనం షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. చౌరస్తాలోని స్తంభానికి ఢీకొని కారు ఆగిపోగా, ఘటనాస్థలం భయానకంగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు ఎస్‌కే మహ్మద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కోనారెడ్డి తెలిపారు.

ముగిసిన డిగ్రీ పరీక్షలు

- చివరిరోజు నలుగురు డిబార్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిశాయి. నిజామాబాద్‌లోని మహిళా డిగ్రీ కళాశాల, గౌతమి డిగ్రీ కళాశాల, భీమ్‌గల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు చొప్పున మొత్తం నలుగురు చూచిరాతకు పాల్పడుతూ పట్టుబడ్డారు. డిగ్రీ పరీక్షల్లో మొత్తం 30 మంది డిబార్ అయ్యారు. శనివారం ఉదయం డిగ్రీ ఆరో సెమిస్టర్ రెగ్యులర్, ఐదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్, మధ్యాహ్నం రెండో సెమిస్టర్ రెగ్యులర్, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

వర్సిటీ పరిధిలో మొత్తం 38 కేంద్రాల్లో శనివారం జరిగిన పరీక్షకు 9,022 మంది విద్యార్థులకుగాను 8,281 మంది హాజరయ్యారని, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 9383 మందికి గాను 8464 మంది హాజరైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య చంద్రశేఖర్ తెలిపారు.



నేడు

పూలకుండీల్లో ఎండి పోయిన మొక్కలు



నాడు

డివైడర్‌పై పూలకుండీల్లో మొక్కలు

నాడు అలా.. నేడు వెలవెల

గత ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశాఖ మంత్రిగా పనిచేసిన హరీశ్ రావు వస్తున్నారని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో హడావుడిగా ఏర్పాటు చేసిన పూలకుండీలు ప్రస్తుతం కళావిహీనంగా మారాయి. మొక్కలు ఎండిపోయినా పట్టించుకునే వారు కరువయ్యారు. మంత్రికి పచ్చదనాన్ని చూపేందుకు భారీ ఖర్చు చేసిన అధికారులు ఇప్పుడు పట్టించుకోవడం లేదు. అలాగే ఆస్పత్రి రెండో గేట్ వద్ద నిర్లక్ష్యంగా వదిలేసిన పూలకుండీలు ధ్వంసం కాగా మొక్కలు ఎండిపోయాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్–నిజామాబాద్



నాడు

పూలకుండీల్లో పచ్చదనంతో కళకళలాడుతున్న మొక్కలు



నేడు

జీజీహెచ్ రెండో గేటు వద్ద మూలనపడి ఉన్న మొక్కలు లేని పూలకుండీలు

ఏడాదిగా వెట్టి చాకిరీ

- ఔట్ సోర్సింగ్ ఏఎన్ఎంలకు అందని వేతనాలు

మోర్తాడ్(బాల్కొండ): వైద్య ఆరోగ్య శాఖలో ఔట్ సోర్సింగ్ విధానంలో ఏఎన్ఎంలుగా ఎంపికై వివిధ సబ్ సెంటర్లలో వైద్య సేవలు అందిస్తున్న 56 మందికి ఏడాది కాలంగా వేతనాలు అందడం లేదు. అధికారుల మధ్య సమన్వయ లోపం ఔట్ సోర్సింగ్ ఏఎన్ఎంలకు శాపంగా మారింది. వేతనాలు చెల్లించకపోతే ఎలా బతకాలని అనేక సార్లు ఔట్ సోర్సింగ్ ఏఎన్ఎంలు ఆందోళనలు చేపట్టినా ఫలితం లేకపోయింది. వివిధ పీహెచ్‌సీలు, సబ్ సెంటర్‌లలో ఉన్న ఏఎన్ఎంల పోస్టులను భర్తీ చేయడానికి 2021 సెప్టెంబర్‌లో నోటిఫికేషన్ జారీ చేశారు. నోటిఫికేషన్ జారీ చేసిన వెంటనే భర్తీ ప్రక్రియ నిర్వహించలేదు. ఏడాదిన్నర ఆలస్యంగా 2023 జూన్‌లో నియామక ఉత్తర్వులను జారీ చేశారు. నాడు 67 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినా ఇప్పుడు 56 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు, రాష్ట్ర అధికారులకు మధ్య సమన్వయం లేకపోవడంతో పోస్టుల భర్తీ అంశంపై తమకు సమాచారం లేదని రాష్ట్ర స్థాయి అధికారులు పేర్కొంటున్నారు. పోస్టులను వెంటది వెంట భర్తీ చేసి ఉంటే బడ్జెట్‌ను కేటాయించే వారిమని, తమకు సమాచారం లేకుండా ఆలస్యంగా పోస్టులను భర్తీ చేసుకోవడంతో రాష్ట్ర ఖజానాకు తాము సమాచారం ఇవ్వలేకపోయామని రాష్ట్ర అధికారులు చెబుతున్నారు. ఔట్ సోర్సింగ్ ఏఎన్ఎంలకు వేతనాలు చెల్లించడానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపు లేకపోవడంతో వేతనాలు చెల్లించే పరిస్థితి లేదు. జిల్లా, రాష్ట్ర అధికారుల మధ్య అవగాహన లేకపోవడంతో వేతనాలు మంజూరి కాక ఉద్యోగినుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. అనేకమార్లు ఆందోళన కార్యక్రమాలు, రాష్ట్ర స్థాయి అధికార యంత్రాంగానికి వినతి పత్రాలు అందించినా ప్రయోజనం లేకపోయింది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలు కారణంగా నాలుగైదు నెలల పాటు వేతనాల విషయంలో వేచి ఉండాలని ఉన్నతాధికారులు సూచించారు. ఏఎన్ఎంలు ఎంత ఓపిక పట్టినా వేతనాల గ్రాంటు మంజూరి కాకపోవడంతో ఇటీవల హైదరాబాద్‌కు వెళ్లి సీఎం రేవంత్ రెడ్డిని కలవాలని యత్నించారు. సీఎం అపాయింట్‌మెంట్ లేని కారణంగా సీఎంవో ఉద్యోగులు ఏఎన్ఎంలను భేటికి నిరాకరించారు. వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ క్రిస్టినా ఛోంగ్తును కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఆమె జిల్లా అధికారులతో మాట్లాడినా సరైన సమాధానం అందలేదు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన తీవ్ర నిర్లక్ష్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరిస్తేనే వేతనాలు మంజూరయ్యే అవకాశం ఉంది. ఇకనైనా సీఎం స్పందించి వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఏఎన్ఎంలు కోరుతున్నారు.

ప్రభుత్వం స్పందించాలి

మాకు ఇవ్వాల్సిన వేతనాల విషయంలో ప్రభుత్వం స్పందించాలి. ఏడాది కాలంగా వేతనాలు అందక మంగళసూత్రాలు, బంగారం తాకట్టు పెట్టి ఇల్లు నడుపుకొంటున్నాం.మా పరిస్థితిని ప్రభుత్వం అర్థం చేసుకుని వేతనాలను విడుదల చేయాలి. 56 కుటుంబాల బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వంతీసుకోవాలి.

– లక్ష్మి, ఔట్‌సోర్సింగ్ ఏఎన్ఎం, రామన్నపేట్

వ్యభిచార గృహంపై టాస్క్‌ఫోర్స్ దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని మూడో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గౌతమ్‌నగర్‌లో వ్యభిచార గృహం కొనసాగుతోందనే అందడంతో సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ విష్ణుమూర్తి, సీఐ పురుషోత్తం శనివారం దాడి చేశారు. ముగ్గురు యువతులు, నలుగురు విటులతోపాటు వ్యభిచారగృహం నిర్వాహకురాలిని అదుపులోకి తీసుకొని మూడోటౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. దాడిలో హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్, రాములు, గజేందర్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి ఒకరి మృతి

మోర్తాడ్: తాటి ముంజల కోసం చెట్టెక్కిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. ఈ ఘటన ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌లో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. బోదాసు గంగాధర్(31) తాటిముంజల కోసం చెట్టెక్కి ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. బాధితుడిని ఆస్పత్రికి తరలించేలోగా మరణించాడు. అయితే స్థానిక గీత కార్మికుడి సూచనమేరకు గంగాధర్ తాటిచెట్టు ఎక్కాడని, బాధిత కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలని మృతుడి బంధువులు ఆందోళన చేశారు. పోస్టుమార్టం పూర్తయినప్పటికీ అంత్యక్రియలు చేయలేదు. బాధిత కుటుంబానికి పరిహారం ఇవ్వాలని మృతుడి బంధువులు ఆందోళన చేయ గా, తమకు ఎలాంటి సంబంధం లేదని గీత కార్మిక సంఘాల వ్యక్తులు చెప్పడంతో గంగాధర్ మృతదేహాన్ని అలాగే ఉంచారు.

పరిస్థితి విషమించి వివాహిత..



గాజ వర్ష (ఫైల్)

మోపాల్: కుటుంబ గొడవల కారణంగా క్షణికావేశంలో పురుగల మందు తాగిన మండలంలోని కంజర్ గ్రామానికి చెందిన గాజ వర్ష (32) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో గంగాధర్ శనివారం తెలిపారు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వర్షకు అదే గ్రామానికిచెందిన గాజ గోవర్ధన్‌తో 13 ఏళ్ల క్రితం వివాహం కాగా, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉంది. గోవర్ధన్ కొంతకాలం దుబాయ్ వెళ్లి వచ్చి వ్యవసాయం చేస్తున్నాడు. గత కొంతకాలంగా భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో గతనెల 27వ తేదీన గొడవ కావడంతో వర్షం పురుగుల మందుతాగింది. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వర్షం పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు గోవర్ధన్ కుటుంబ సభ్యులపై దాడి పాల్పడే అవకాశం ఉందని భావించిన పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతురాలి తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

భిక్కనూరుకు చెందిన వ్యక్తి..

భిక్కనూరు: మండల కేంద్రానికి చెందిన కొటాని రంజిత్(29) అనే వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్సై సాయికుమార్ శనివారం తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుల మేరకు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వరుసకు బావ అయిన మెదక్ జిల్లా రామాయంపేట మండలం దామరచెరువుకు చెందిన జరిపోతుల బాబుతో కలిసి ఈనెల 3వ తేదీన రంజిత్ మండలంలోని రామేశ్వర్‌పల్లిలో కల్లు తాగాడు. అనంతరం మండల కేంద్రానికి వచ్చి ఎల్లమ్మ ఆలయం వద్ద ఉన్న కల్లు దుకాణంలో కల్లు తాగుతుండగా, బాబు తన వెంట తెచ్చుకున్న గడ్డిమందును కల్లులో కలిపి రంజిత్‌తో తాగించాడు. కిందపడిపోయిన రంజిత్‌ను వెంటనే కామారెడ్డి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి సోదరుడు కొటాని రామ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు

నవీపేట: తాగిన మైకంలో పోలీసులతో వాగ్వాదానికి దిగి విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ శనివారం తెలిపారు. అబ్బాపూర్(ఎం) గ్రామానికి చెందిన శ్రీనివాస్, లక్ష్మణ్ శనివారం ఉదయం తాగిన మైకంలో న్యూసెన్స్ చేస్తున్నారని గ్రామస్తులకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చేరుకున్న కానిస్టేబుళ్లు సతీశ్, అఫీజ్‌ను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా వాగ్వాదానికి దిగి విధులకు ఆటంకం కలిగించారు. కానిస్టేబుల్ సతీశ్ ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు.

ఈనెల 18న వాహనాల వేలం

ఖలీల్‌వాడి: ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను నిజామాబాద్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ జిల్లా అధికారి మల్లారెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 18న వేలం వేయనున్నట్లు ఎస్‌హెచ్‌వో దిలీప్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10గంటలకు బహిరంగ వేలం ప్రారంభమవుతుందని, పూర్తి వివరాల కోసం ప్రొహిబిషన్, ఎక్సైజ్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

రాజరాజేశ్వరి ఆలయంలో చోరీ



దుండగులు ఎత్తుకెళ్లిన సీసీ కెమెరా హార్డ్‌డిస్క్

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని వీక్లీమార్కెట్‌లో ఉన్న శ్రీరాజరాజేశ్వరి ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. తాళాలను పగులగొట్టి లోనికి చొరబడిన దుండగులు హుండీని ధ్వంసం చేసి నగదును, మరో హుండీని ఎత్తుకెళ్లారు. ఆలయంలో సీసీ కెమెరాలు ఉన్నాయని గమనించిన దుండగులు హార్డ్‌డిస్క్‌ను సైతం ఎత్తుకెళ్లారు. పోలీసులు శనివారం ఉదయం ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో..

నవీపేట: మండలంలోని అబ్బాపూర్(ఎం)లో శుక్రవారం రాత్రి దుండగులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారని ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. పెట్రోల్‌బంక్‌లో పనిచేసే గ్రామానికి చెందిన అరుణ్ విధులకు వెళ్లగా, ఆయన భార్య తల్లిగారింటికి వెళ్లింది. శనివారం ఉదయం ఇంటికి వచ్చిన అరుణ్ తాళం పగులగొట్టి ఉండడం చూసి లోనికి వెళ్లి చూశాడు. దుండగులు బీరువాను పగులగొట్టి రెండు తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు నిర్ధారించుకొని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

నందిపేట్(ఆర్మూర్): ఆర్థిక ఇబ్బందుల కారణంగా నిర్మల్ జిల్లా తానూర్ మండల కేంద్రానికి చెందిన బుర్రి లక్ష్మణ్(38) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాహుల్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి..

బుర్రి లక్ష్మణ్ గత కొంతకాలంగా మోపాల్ మండలం మంచిప్పలో వ్యవసాయ కూలీగా పని చేస్తూ భార్యాపిల్లలతో కలిసి ఉంటున్నాడు. శనివారం ఉదయం 9గంటలకు నందిపేటలో ఉంటున్న తమ్ముడు బుర్రి గంగాధర్ వద్దకు వచ్చిన మద్యం సేవించాడు. ఓ వైపు తాగుడికి బానిసకావడం, మరో వైపు ఆర్థిక ఇబ్బందుల కారణంగా జీవితంపై విరక్తి చెంది బస్టాండ్ సమీపంలోని చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి తమ్ముడు గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి గొంతు కోసిన అగంతకులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని సిద్ధుల గుట్ట వెనుక ప్రాంతంలో మహారాష్ట్రకు చెందిన సోనుకుమార్ అనే యువకుడి గొంతును దుండగులు శనివారం కోశారు. తీవ్రరక్త స్రావం అవుతుండగానే రోడ్డువైపు నడుచుకుంటూ వచ్చిన సోనుకుమార్ కుప్పకులాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న 108 సిబ్బంది బాధితుడిని ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సిద్ధులగుట్ట ప్రాంతంలో గాలింపు చేపట్టారు. బాధితుడు కోలుకుంటే పూర్తి వివరాలు తెలుస్తాయని ఎస్‌హెచ్‌వో రవికుమార్ పేర్కొన్నారు.